ఏయూ హిందీ విభాగాధిపతిగా ఆచార్య సత్యనారాయణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: హిందీ విభాగాధిపతిగా ఆచార్య నల్ల సత్యనారాయణ నియమితులయ్యారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు నుంచి స్వీకరించారు. అనంతరం విభాగాధిపతిగా బాధ్యతలను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ. నరసింహారావు నుంచి అందుకున్నారు. తనకు విభాగాధిపతిగా బాధ్యతలను అప్పగించిన వీసీ, ఉన్నతాధికారులకు ఆచార్య సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

మూలకు చేరిన బయోడైజెస్టర్

కనీస నిర్వహణ శున్యం
ఏళ్ల తరబడి మూలన పడ్డ యంత్రం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం ప్రాంతాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రస్తుత దేవాదాయ శాఖ ఏడీసీ (అదనపు కమిషనర్) కె.రామచంద్రమోహన్ రూ.లక్షలు వెచ్చించి క్రిష్ణాపురం గోశాలలోను కంపోస్టు షెడ్డు నిర్మాణం, కొండపైన నిత్యాన్నదాన భవనం ప్రక్కన విశాఖ స్టీల్‌ప్లాంట్ సౌజన్యంతో వర్మీ కంపోస్ట్ యంత్రం కొనుగోలు చేశారు. ఒకటో దశలో పర్యావరణం వచ్చదనం ఏర్పాటు చేసినా, రెండో దశలో తలపెట్టిన యాంత్రీకరణ నిలిచిపోవడంతో వ్యర్థాల నిర్వహణ దేవస్థానంకు భారమైంది. వివరాల్లోకి వెళ్తే 2018 ఫిబ్రవరి 13న నిత్యాన్నదానం భవనంకు సమీపంలో ఏర్పాటు చేసిన బయో డైజెస్టర్ ఇప్పుడు మూలకు చేరుకుంది. దీనిద్వారా 250 కేజీల ఎరువు ఉత్పత్తి జరుగుతుంది. రాష్ట్రంలో ఇటువంటి శుద్ధమైన బయో డైజెస్టర్ లేదు. బయోడైజెస్టర్‌లు ఉన్న వాటిలో కొన్ని రసాయనాలు కలుపుతున్నారని ఆరోజు ఈవోగా విధులు నిర్వహించిన రామచంద్ర మోహన్ అన్నారు. నాటి నుండి ఎందరో ఈఓలు మారినప్పటికీ అటువైపు దృష్టి సారించిన పాపాన పోలేదు. రోజుకు వాడిన పూలు, ఆకులు మొదలగు వాటిని ఈ యంత్రంలో (మిషన్) వేస్తే

నిత్యాన్నదాన ప్రసాద భవనం ప్రక్కన మూలకు చేరిన బయో డైజెస్టర్ యంత్రం

రోజుకు 250కేజీల శుద్ధమైన ఎరువు ఉత్పత్తి జరుగుతుండేది. అలా వ్యర్థాల నుండి వచ్చిన ఎరువును పూల మొక్కలు, కృష్ణాపురం గోశాలలో ఉన్న కూరగాయలు మొదలగువాటికి ఉపయోగించేవారు. భక్తులు, దాతలు నిధులతో నిర్మించిన ఈ యూనిట్‌లో ప్రస్తుతం చడీ చప్పుడు లేకుంది. ఇంత వరకూ బాగానే ఉన్నా... దాని నిర్వహణ లోపంలో వెనుకబడ్డారు. ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోతున్న చెత్తతో అనారోగ్యకర వాతావరణం నెలకొన్న దశలో... ఓ చక్కని పరిష్కారంగా 2018లో ఈ ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్‌ను రూపకల్పన చేశారు. చిన్న మధ్య తరగతి పట్టణాల మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకం క్రింద ప్లాంట్ యాజమాన్యం వారు ఈ నిధుల క్రింద ఈ యంత్రాన్ని దేవస్థానంకు విరాళంగా ఇవ్వటం జరిగింది. దేవస్థానం తన వంతుగా కొన్ని నిధులు సమకూర్చింది. దీనివల్ల తక్కువ సమయంలోనే అవసరమైన తడి చెత్తను సేకరించే అవకాశం ఉంది. కానీ, ఇది ప్లాట్‌ఫాం మీద సంబంధిత ప్రదేశంలో నిరుపయోగంగా ఉంది. వ్యర్థాల నిర్వహణ వేగంగా, సులువుగా చేపట్టేందుకు లక్షలు ఖర్చు చేసి యంత్రాలు కొనుగోలు చేసినా ఇంత వరకూ వాటిని వినియోగంలోకి తీసుకురాలేక పోయారు. అధికారులు యాంత్రీకరణ వైపు మొగ్గ చూపారు. దాతలు ఇచ్చిన బయో డైజెస్టర్‌పై ఎవరూ కన్నెత్తైనా చూడక పోవటం చాలా విచారకరం అని నిత్యాన్నదానంకు వెళ్లే భక్తులు, స్థానికులు అంటున్నారు.

ఏయూ ఇన్‌చార్జి వీసీని కలిసిన ఏఐఎస్ఎఫ్ నేతలు

విశాలాంధ్ర - విశాఖ: ఆంధ్రా యూనివర్సిటీ నూతన ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ శశిభూషణ్ ని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) ప్రతినిధి బృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ రచించిన భారత రాజ్యాంగ పీఠిక పుస్తకాన్ని జ్ఞాపికగా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే యూనివర్సిటీ లోపల ఉన్న గ్రిల్స్ తొలగించడం శుభపరిణామమని అన్నారు. యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్తుకు మార్గం చూపాలని, యూనివర్సిటీలో ఎటువంటి రాజకీయ కార్యకలాపాలు నిర్వహించకూడదని విజ్ఞప్తి చేశారు. దానికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ కచ్చితంగా యూనివర్సిటీ అభివృద్ధి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్ శ్రీను, నాయకులు కిరణ్, శేఖర్, హేమానంద్ దిలీప్, గణేష్ పాల్గొన్నారు.

చిల్లర వర్తక సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర - సాగర్ నగర్: చిల్లర వర్తక సంఘం నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటైంది. సాగర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో వార్డు టీడీపీ అధ్యక్షులు చెట్టుపిల్లి గోపి, కార్యదర్శి బోడేపూడి దొరబాబు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా కిల్లి శ్యామలరావు, ఉపాధ్యక్షులుగా షేక్ సలీమ్, ఎస్.జనార్ధన్, ప్రధాన కార్యదర్శిగా బీఆర్ ప్రతాప్, జాయింట్ సెక్రటరీ ఎం.రాము, కోశాధికారి అంధవరపు రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుడ్ల తాతారావు, సభ్యులుగా అల్లాడ మధు, గోరంట్ల అనంత్, బి.గోపి, జి.సూర్యప్రకాష్, షేక్ బాసంగి తదితరులను నియమించారు. ఈ సందర్భంగా ఎంపికైన కమిటీ సభ్యులను టీడీపీ నియోజకవర్గ నాయకులు చిక్కాల విజయ్ బాబు తదితరులు అభినందించారు.

ఘనంగా కన్నెలమ్మ పండగ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నెల్లిమక్కు గ్రామ పంచాయతీ పరిధిలో గల శ్రీ పెంటమ్మ తల్లి ఆలయ ఆవరణలో గల శ్రీ కన్నెలమ్మ పండగను సోమవారం గ్రామ పెద్దలు, దొడ్డి పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గతంలో ఉన్న ఆచారం ప్రకారం ఆషాడ మాసంలో వర్షాలు కురవాలని, పాడి పంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కన్నెలమ్మ అమ్మవారికి పాలాభిషేకాలు నిర్వహించారు. కానీ ఈ సంవత్సరం విశాఖపట్నం స్టీలుప్లాంట్ కష్టాలు నుండి గట్టెక్కి ఉక్కు నిర్వాసితులందరికీ ఉపాధినిచ్చి ఈ ప్రాంత ప్రజలంతా సుఖ సంతోషలతో జీవించాలని కోరుకున్నట్లు భక్తులు తెలిపారు.

ఇన్‌స్పైర్ - మనక్ గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్) కార్యక్రమ గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి కె. ప్రసాద్ ఇతర జిల్లా అధికారులు భాగస్వామ్యమై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, జీవీఎంసీ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ఆదుకోవాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగేవిధంగా స్పష్టమైన ప్రకటన చేయాలని విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు సోమవారానికి 1257వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో ఏఐటీచయూసీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎస్.ఎన్.రావు, డి.ఆదినారాయణ మాట్లాడుతూ నేటి నుండి ప్రారంభమవుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగే విధంగా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రత్యేక ప్యాకేజీతో పూర్తి సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు ఏ.మసేన్‌రావు, నరేష్ కుమార్, డొక్కా నర్సింగరావు, కె.రాజబాబు, జి.జయ, శివ రామ కృష్ణ, తాండ్ర కనక రాజు, చీకటి శ్రీనివాస్, బి.ఎం.ఎల్.నాయుడు, రంగ ప్రసాద్, టి.ఎస్.ఎన్, సీతా రామరాజు, సీఐటీయూ నాయకులు యు.రామ స్వామి, జెఎంఎస్ నాయకులు వరసాల శ్రీనివాస్, టీఎన్‌టీయూసీ నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, విఎంఎస్ నాయకులు కె. శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

జిమ్సర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - మధురవాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) వైద్య కళాశాల, ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు గత మూడు రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. అప్పుగర్, సింహాచలం కొండపై గిరి ప్రదక్షిణ సమయంలో పత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అలాగే గీతం వైద్య కళాశాల వైద్యులు నేతృత్వంలో వైద్య విద్యార్థులు బృందాలుగా ఏర్పడి నగరంలోని వివిధ ప్రాంతాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ సూచనల మేరకు ప్రజలకు వైద్య సహాయం అందేలా ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

జిల్లాలో వరద నష్టం తెలియజేయండి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాల వలన జరిగిన నష్టం వివరాలను తక్షణమే అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీఓ డి.హుస్సేన్ సాహెబ్ భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాల నేపథ్యంలో జరిగిన నష్టం నివేదికలను కలెక్టర్ కార్యాల యానికి సోమవారం సాయంత్రంలోగా సమర్పించాలని సంబంధిత శాఖలైన వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, నీటిపారుదల, జీవీఎంసీ, విద్యు త్, ఫైర్ తదితర శాఖలను కలెక్టర్ ఆదేశించారు. నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు, జిల్లా అధికారులు, జీవీఎంసీ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయీ సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసినట్టు జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్, విశాఖపట్నం జిల్లా కలెక్టరు ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం తెలిపారు. జివిఎంసి నందు ప్రస్తుత స్థాయీ సంఘం కాలపరిమితి ముగిసినందున, తదుపరి స్థాయీ సంఘ సభ్యులను ఎన్నుకొనుటకు ఎన్నికల నోటీసు జారీ చేసినట్టు తెలిపారు. స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక ప్రక్రియ నియమావాళికి సంబంధించి ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 03.00 గంటల వరకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ (జనరల్) కార్యాలయం నందు నామినేషన్లు స్వీకరించబడునని, నామినేషన్ పత్రములు కార్యాలయం పని వేళలలో జివిఎంసి కార్యదర్శి విభాగం నుండి పొందవచ్చని తెలిపారు. ఈనెల 30వ తేదీ సాయంత్రం 5.00 గంటలకు మొత్తం అందిన నామినేషన్లు జాబితాను ప్రచురించబడతాయని, 31వ తేదీ ఉదయం 11.00 గంటల నుండి నామినేషన్ల స్క్రూట్నీ జరుగునని, అదే రోజున అర్హత గల ప్రామాణికమైన అర్హత కలిగియున్న నామినేషన్ల జాబితాను ప్రచురించబడునని తెలిపారు. ఆగస్టు 3వ తేదీ మధ్యాహ్నం 03.00 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణకు తుది గడువన్నారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రచురించబడునన్నారు. ఆగస్టు 7వ తేదీ ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరము నందు ఎన్నికల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు జరిపి తుది ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు.

ఏయూ వీసీని కలిసిన ఏబీవీపీ బృందం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన ఆచార్య జి.శశిభూషణరావును అఖిల భారత విద్యా పరిషత్ ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులు విశ్వవిద్యాలయ సమస్యలను వైస్ ఛాన్సలర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటికి సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తారని ఆయన హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విశాఖపట్నం సంఘటన కార్యదర్శి సాయి కుమార్, రాష్ట్ర విశ్వవిద్యాలయల కన్వీనర్ కిరణ్ కుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి క్యామ శ్రీకాంత్, మీడియా కన్వీనర్ కోటేశ్వరరావు, న్యాయ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు హరిచంద్రిక, అయ్యప్ప ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు రాజు, నాయకులు తరుణ్, వెంకటేష్, పూర్ణచంద్ర, ఆనంద్, రాజశేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ స్టాఫ్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ స్టాఫ్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రసాద్, జనరల్ సెక్రటరీగా ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా శంకర్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా రవిశంకర్, రవికుమార్, అడిషనల్ సెక్రటరీగా రాజేష్, కోశాధికారిగా రమణారావు, ఉప కోశాధికారిగా రాము, సంయుక్త కార్యదర్శులుగా సాగర్, కిషోర్, నాగ గోవిందరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నవీన్, సూర్యనారాయణ రాజు, భాస్కర్ ఎన్నికయ్యారు.

విద్యార్థులకు సాక్సులు పంపిణీ

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన చెన్న ప్రసాదరావు జ్ఞాపకార్థం తన కుమారుడు చెన్నా వెంకటేష్ చిట్టివలస జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల విద్యార్థులకు సాక్సులు పంపిణీ చేశారు. పెద్దపాలెం చెన్న ఫంక్షన్ హాల్ అధినేత చెన్న వెంకటేష్ తండ్రి చెన్న ప్రసాదరావు ఇటీవల మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు సుమారు 15 వేల రూపాయలు విలువచేసే సాక్సులను 600 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్, చెన్న వెంకటేష్, మరి పిల్ల శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు నీరు పోవడానికి దారెక్కడ..?

విశాలాంధ్ర - ఆనందపురం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందువలన ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించి నీటి నిల్వలు లేకుండా చూడవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉంది. నీరు నిల్వ ఉండడం వల్ల వాటి మీద దోమలు, కీటకాలు చేరి డెంగీ, మలేరియా, టైఫాయిడ్, అనేక రకాలు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వివరాల్లోకి వెళితే భీమిలి క్రాస్ రోడ్ హెూటల్ కామత్ ప్రక్కనే నీటి కాలువ అందరినీ కలవరపెడుతుంది. వాడుక నీరు వ్యర్థ పదార్థాలు కాలువలో నిల్వ ఉండడం వల్ల తీవ్రమైన దుర్వాసన వస్తుంది. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడం వలన వాహనదారులకు చెడు వాసన వెదజల్లుతుంది. పంచాయతీ అధికారులు, హైవే అధికారులు స్పందించి నీటి నిల్వలు లేకుండా మురుగునీరు పోవటానికి మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని అమ్మకానికి పెట్టిన వారిపై కేసు నమోదు చేయండి

విదసం డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సాంఘిక సంక్షేమశాఖ భూమిని కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్న ముత్తబత్తుల రత్న కుమార్‌పై తక్షణమే కేసు నమోదు చేసి ప్రభుత్వ ఆస్తికి రక్షణ కల్పించాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేసిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో సహాయ కన్వీనర్ సుజాత, వెంకటరావు మాట్లాడుతూ సిరిపురం టైకూన్ జంక్షన్‌లో సాంఘిక సంక్షేమశాఖకు చెందిన 3500 గజాల ప్రభుత్వ భూమి మాజీ పార్లమెంటు సభ్యుడు ఎంవివి సత్యనారాయణ కబ్జా నుండి 2022లో విదసం ఆధ్వర్యంలో పోరాడి ప్రభుత్వానికి అప్పగించామని, మళ్లీ మారో కబ్జాదారుడు ముత్తబత్తుల రత్న కుమార్ అనే వ్యక్తి దీనిపై కన్నేసి ఆక్రమణ బోర్డు పెట్టాడని, దీన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోకపోవడంతో ఏకంగా ఈ భూమి మొత్తాన్ని అమ్మకానికి పెట్టడన్నారు. ఈ రత్న కుమార్‌పై భూకబ్జాలు, హత్యా కుట్రలు, మోసం, కొట్లాట వంటి 12 క్రిమినల్ కేసులు ఉన్న సస్పెక్ట్ షీటర్‌గా కాకినాడ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ వద్ద కేసులు ఉన్నాయన్నారు. ఇతని ఆగడాలపై కాకినాడ పోలీసు నిఘా పెట్టడంతో ఇతని నేర కార్యకలాపాలు విశాఖకు మళ్లించాడని కలెక్టరుకు ఫిర్యాదు చేశామన్నారు.

కూతురిపై అత్యాచారం కేసులో తండ్రికి 20 సం.ల కఠిన కారాగార శిక్ష

విశాలాంధ్ర - మల్కాపురం: మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు సంవత్సరాల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో, కన్న తండ్రి అయిన చోడిపల్లి మురళీ కృష్ణ కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.12,000/- జరిమానా విధిస్తూ ప్రభుత్వం నుండి బాధితురాలికి రూ.4,00,000/- పరిహారం చెల్లించాలని పోక్సో కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ముద్దాయిలకి శిక్ష పడే విధంగా కృషి చేసిన అధికారులను సీపీ డా. ఏ.శంఖబ్రత బాగ్చి, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ అభినందించారు.

FEDBANK FINANCIAL SERVICES LIMITED
ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ నం.1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నం.71ఎ, పొవై, పాస్పోలి, ముంబై-400087

స్వాధీనత ప్రకటన

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అధీకృత అధికారియైన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2022) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత/తనఖాదారు/ సహ-ఋణగ్రహీతలైన (1)ఎం/ఎస్. జోషితా శ్రీ ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్, దానికి యజమానిగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్.శాంతి (ఋణగ్రహీత) (2) శ్రీమతి రాకోటి శాంతి తండ్రి సత్యారావు గొర్లె (సహ-ఋణగ్రహీత) (3)శ్రీమతి రాకోటి కన్నారావు తండ్రి రాకోటి రామునాయుడు లేటు (సహ-ఋణగ్రహీత) (4) శ్రీ తర్రా సంతోష్‌కుమార్ తండ్రి నూకునాయుడు తర్రా (హామీదారు) లకు నోటీసులో ప్రస్తావించిన మొత్తం బకాయి ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృచ్ఛిక ఖర్చుల వగైరాలతో కలిసి 09.05.2024 నాటికి రూ.27,01,924/-(ఇరవై ఏడు లక్షల ఒక వెయ్యి తొమ్మిది వందల ఇరవైనాలుగు రూపాయలు మాత్రమే) లను నోటీసు తేదీ నుండి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ తేదీ : 14 మే, 2024 న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. మరియు తేదీ: 17 మే, 2024న వార్తాపత్రికలో ప్రచురించడమైనది. ఋణగ్రహీత/తనఖాదారు/సహ-ఋణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున దిగువ సంతకందారు నిబంధనల్లో తెలిపిన నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించిన ఆస్తిని జూలై 20, 2024 న లాంఛనప్రాయంగా స్వాధీనపర్చుకొనడమైందని ప్రత్యేకించి ఋణగ్రహీత/తనఖాదారు/సహ-ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని మరియు ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు, ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృచ్ఛిక ఖర్చుల వగైరాలతో కలిసి 09.05.2024 నాటికి రూ.27,01,924/-(ఇరవై ఏడు లక్షల ఒక వెయ్యి తొమ్మిది వందల ఇరవైనాలుగు రూపాయలు మాత్రమే) ల కొరకు ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ వార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు మరియు సాధారణప్రజలను హెచ్చరించడమైనది. హామీగా పెట్టిన ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా ఋణగ్రహీతలను కోరడమైనది.

షెడ్యూల్-ఎ- ఆస్తి వివరాలు: (ఎఫ్ఎఫ్ఎస్ఎల్‌కు తనఖా పెట్టిన స్థిర ఆస్తి యొక్క వివరాలు): విశాఖపట్నం జిల్లా, బోదవరం సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్, రావికమతం మండలం, బ్రాహ్మణవీధి, శెట్టివారి వీధి దారి, వార్డ్ నం.1, బ్లాక్ నం.1 రావికమతం గ్రామ సర్వే నం.78-11 కిందకు వచ్చు 1227 ప్లింత్ ఏరియా గ ఆర్‌సిసి ఇల్లు, అసెస్‌మెంట్ నం.92, కొత్త డి.నం.1-77, కొత్త అసెస్‌మెంట్ నం.77, డి.నం.1-38 ఆధారంగా ఉన్న 0.04 సెంట్లు లేదా 193.6 చదరపు గజాలు లేదా 161-87426 చదరపు మీటర్ల విస్తీర్ణపు కొలత ఆస్తి మొత్తంగా. సరిహద్దులు: తూర్పు: రొక్కం సత్యావతి ఇల్లు, దక్షిణం: గ్రామ పంచాయతీ రాస్తా, గొర్లి ప్రసాద్ మరియు కోనేటి కామరాజు యొక్క ఖాళీస్థలం, పడమర: ముచ్చకర్ల రాము యొక్క ఖాళీ స్థలం, ఉత్తరం: గోర్జా రాస్తా. శ్రీమతి రాకోటి శాంతి సొంత ఆస్తి

సం/-
అధీకృత అధికారి,
ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

ప్రదేశము : విశాఖపట్నం జిల్లా
తేదీ : 20/07/2024

చంద్రబాబు నాయుడు విజనరీ గల నాయకుడు

– గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం పట్ల హర్షం వ్యక్తం చేసిన బి.వి.రామ్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ గల నాయకుడని గవర్నర్ అబ్దుల్ నజీర్ తన ప్రసంగంలో పేర్కొవడం పట్ల తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం సిరిపురంలో ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు సత్తా ఏమిటో రాష్ట్ర శాసనసభలో గవర్నర్ ప్రసంగాన్ని బట్టి ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవచ్చునన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు కావడంతో 2014 నుంచి 2019 వరకు రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించిందన్నారు. 2019 ఎన్నికల తర్వాత వైసీపీ పాలనలో రాష్ట్రం వెనకబడిందన్నారు. చంద్రబాబు హయాంలో వచ్చిన పెట్టుబడులు జగన్ హయాంలో వెనక్కి వెళ్లిపోయాయని ప్రస్తావించారు. 2024 ఎన్నికలో విజయం సాధించిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింప జేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని నిరసిస్తూ వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడాన్ని బి.వి.రామ్ తప్పుపట్టారు. సభలో ప్రతి ఒక్కరూ హుందాగా ఉండాలని.. వైయస్ జగన్ అండ్ కో రాష్ట్ర గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు.

ఆ జాబితా ఎందుకు విడుదల చేయరు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 36 మంది ప్రాణాలు కోల్పోయారు అని చెబుతున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆ జాబితాను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. జగన్ ప్రజలకు మాయమాటలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విజనరీ ఉన్న నాయకుడు చంద్రబాబు వెంటే ప్రజలు ఉంటారని, ఆర్థిక నేరగాడైన జగన్ మోహన్ రెడ్డితో ఉండేందుకు ఎవరూ మనస్ఫూర్తిగా అంగీకరించరన్నారు.

చివరికి అతని నీడ కూడా అయిష్టంగానే జగన్ వెంట ఉంటుందని వ్యాఖ్యానించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అవకతవకల పై కూటమి ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రాలకు జగన్ అసెంబ్లీలోనే సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. శాసనసభలో తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని ఢిల్లీకి పిల్లిలా పారిపోతున్నారన్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులలోనే అక్రమాలు జరిగాయంటూ ఢిల్లీలో ఫోటో ఎగ్జిబిషన్ పెట్టేందుకు జగన్ సిద్ధం అవుతున్నారన్నారు. అయితే ఆ ఫోటో ఎగ్జిబిషన్ ను జగన్మోహన్ రెడ్డి అండ్ కో తప్ప ఇతర పార్టీల వారు ఎవరూ హర్షించరన్నారు.

ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారం కావాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కారం కావాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లాఅధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం అందే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్ణీత గడువు లోగా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్.డి.ఓ డి.హుస్సేన్ సాహెబ్ భాగస్వాములై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 189 అర్జీలు అందగా, వాటిలో పింఛన్ల మంజూరు, స్థానిక సమస్యల పరిష్కారం కోరుతూ ఎక్కువగా వినతులు వచ్చాయి. మొత్తం అందిన అర్జీలలో 67 రెవిన్యూ శాఖ, 55 జీవీఎంసి, 21 పోలీస్ శాఖ, 46 ఇతర శాఖలకు చెందిన అర్జీలు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని అన్నారు. పనితీరులో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు, జిల్లా అధికారులు, జీవీఎంసీ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విశాలాంధ్ర – పద్మనాభం: మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన కసిరెడ్డి సింహాద్రి కుమారుడు కసిరెడ్డి అప్పారావు (21) తన పొలంలో విద్యుత్ మోటారు ఆన్ చేయుచుండగా విద్యుత్ షాకునకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

రెనో 12 5జి సిరీస్‌ను విడుదల చేసిన ఒప్పో

విశాలాంధ్ర – విశాఖపట్నం: ఒప్పో ఇండియా నేడు రెనో 12 సిరీస్ ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, దేశంలో ఏఐ ఫోన్‌ల లభ్యతను వేగవంతం చేసే దిశగా తొలి అడుగు వేసింది. రెనో 12 సిరీస్ – "నిత్యం మీకు తోడుండే ఏఐ"– ఇది క్లిష్టమైన ఇమేజ్‌లను ఎడిటింగ్ లేకుండా ఫన్నీ ఫోటోలను అందించేందుకు ఏఐ ఎరేజర్ 2.0, ఏఐ క్లియర్ ఫేస్, ఏఐ బెస్ట్ ఫేస్ మరియు స్మార్ట్ ఇమేజ్ మ్యాటింగ్ 2.0 వంటి ఫీచర్లను కలిగి ఉంది. ఈ పరికరాలు రోజువారీ ఉత్పాదకతను పెంచడానికి ఏఐ రైటర్, ఏఐ సమ్మరీ, ఏఐ స్పీక్‌లను కలిగి ఉన్న గూగుల్ జెమిని ఎల్ఎల్ఎం ఆధారితమైన ఏఐ టూల్‌బాక్స్‌ను కూడా కలిగి ఉంటుందని హెడ్ పీటర్ డోహ్యూంగ్ లీ తెలిపారు.

వర్షంలోనూ పట్టువదలని సాహసం

ఉక్కునగరం సెక్టర్–6లో భారీ కొండచిలువను పట్టుకున్న స్నేక్ సేవర్ కిరణ్

విశాలాంధ్ర – గాజువాక: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో పాముల బెడద కూడా చాలా చోట్ల ప్రజల్ని భయాందోళనకు గురిచేస్తోంది. విశాఖ ఉక్కునగరం సెక్టర్–6,క్వార్టర్ నంబర్–106లో డిజిఎం మిశ్రా కుటుంబం నివసిస్తోంది. సాయంత్రం ఇంటి పెరట్లో భారీ కొండచిలువన చూసిన కుటుంబ సభ్యులు భయంతో ఇంట్లో దాగున్నారు. వెంటనే స్నేక్ సేవర్ రొక్కం కిరణ్ కు సమాచారం అందించారు. అతను అక్కడికి చేరుకొని బోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా పెరట్లోకి వెళ్లి ఓ పొదులో చిక్కుకొని ఉన్న కొండచిలువను అతి సాహసంతో పైకి తీశారు. ఆ సమయంలో కొండచిలువ అతన్ని కూడా చుట్టుకుంది. అతి కష్టంపై దాన్ని బయటకు తేవడంతో ఇరుగుపొరుగు వాళ్ళంతా ఊపిరి పీల్చుకున్నారు. కిరణ్ సహసాన్ని డిజిఎం ఈ సందర్భంగా అభినందించారు

పౌరాణిక నటుడు అప్పారావుకి సత్కారం

విశాలాంధ్ర – ఆనందపురం: గురుపౌర్ణమి పర్వదినాన ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో పౌరాణిక నటుడు ఉప్పాడ అప్పారావును ఘనంగా సత్కరించారు. గుండు చినబాబు–శైలజ దంపతులు 1500 మందికి అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి అసెంబ్లీ టీడీడీ ఇన్చార్జ్ కోరాడ రాజబాబు, బి.జె.పి అసెంబ్లీ కన్వీనర్ కంటుభక్త రామానాయుడు, మరుపిళ్ల శ్రీనివాసరావు, మహంతి శివాజీ, పి.ప్రసాద్, కె.మురళీ, కె.వెంకటేశ్, బి.మల్లిఖార్జునరావు, జనసేన నాయుకులు పి.జీవన్, ఎన్.అప్పలరాజు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై చాతుర్మాస దీక్షలు ప్రారంభం



విశాలాంధ్ర – పెందుర్తి: చాతుర్మాస దీక్షలో భాగంగా ఉత్తరాంధ్ర తిరుపతిగా భాసిల్లుతున్న పెందుర్తి వేంకటాద్రిలో సోమవారం చాతుర్మాస కార్యక్రమాలు ఘనంగా ప్రారభమైనట్లు ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. ఈ నెల 22న ప్రారంభమైన వేడుకల్లో మొదటి 27 రోజులపాటు, రోజూ శ్రీ రామాయణ హవనం, ప్రత్యేక పూజలు వుంటాయని, అలాగే వచ్చే నెల 18 నుండి చివరి 13 రోజులూ ప్రతీ రోజూ, వేంకటేశ్వర కళ్యాణం జరుగుతాయని వెల్లడించారు. ఆగస్టు 31న శనివారం నాడు పూర్ణాహుతి, అన్న సమారాధనతో చాతుర్మాస దీక్షలు ముగుస్తాయన్నారు. ఆలయంలో చాతుర్మాస దీక్షలు, హోమాలు, కళ్యాణాలు చేయటం మొదలు పెట్టిన నాటినుండి, ఆలయం బాగా అభివృద్ధి చెందిందని, అలాగే ఈ కార్యక్రమాలలో పాల్గొన్న దంపతులు, వారి కుటుంబాలు కూడా ఎంతో వున్నత స్థితిలో వున్నాయని రామాను జాచార్యులు తెలియజేసారు. చాతుర్మాసం మొత్తం అత్యంత పుణ్యప్రదమైన కాలం అని, ఈ సమయంలో చేపట్టే పుణ్యకార్యక్రమాలు భక్తులకు, వారి కుటుంబాలకు ఎంతో పుణ్యఫలాలను అందిస్తాయని పేర్కొన్నారు.

స్టూడెంట్ కిట్స్ అందజేసిన కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్

విశాలాంధ్ర – ఆనందపురం: మండలంలోని వేములవలస యంపిపి పాఠశాల విద్యార్థులకు స్థానిక పంచాయతీ ఉప సర్పంచ్, టిడిపి యువ నాయకుడు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ సోమవారం స్టూడెంట్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తమ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పేట వేస్తుందన్నారు. పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు చర్చించుకుని మెగా డీఎస్సీని ఏర్పాటు చేశారు అన్నారు. ఎక్కడా టీచర్ల కొరత లేకుండా విద్యార్థుల నిష్పత్తికి తగ్గట్టుగా బోధనా సిబ్బందిని నియమిస్తున్నారని చెప్పారు. విద్యాపరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే భీమిలి కూటమి అభ్యర్థి ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. గతంలో ఆయన కూడా విద్యాశాఖ మంత్రిగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభాషిణి, ఉపాధ్యాయురాలు రమణమ్మ పాల్గొన్నారు.

మత బోధన చేస్తున్న స్ప్రింగ్ ఫీల్డ్ స్కూల్‌పై ఫిర్యాదు

విశాలాంధ్ర – పద్మనాభం: మత బోధన చేస్తున్న స్ప్రింగ్ స్కూల్‌పై అదే స్కూల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామంలో ఉన్న స్ప్రింగ్ ఫీల్డ్ పబ్లిక్ స్కూల్ నందు క్రిస్టియన్ మతానికి సంబంధించినటువంటి క్లాసులు ఒకటవ తరగతి నుండి 9వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఈ స్కూలు క్రిస్టియన్ మిషనరీకి సంబంధించిన స్కూలు కాకపోయినప్పటికీ ఒక సబ్జెక్టుగా పిల్లలకు మత బోధన చేస్తున్నారు. క్రిస్టియన్ మిషనరీ స్కూల్ కాకపోయినందున అన్ని మతాలకు సంబంధించిన పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ స్కూల్లో చేర్చడం జరిగింది. అయినప్పటికీ ఆడపిల్లలకి బొట్టు, పువ్వులు పెట్టుకోవద్దని గాజులు కూడా వేసుకోవద్దని నిబంధనలు పెడుతున్నారు. కావున ఈ విషయమై విచారణ జరిపించి మిగతా అన్ని మతాల వారి మనోభావాలను దెబ్బతీస్తున్నటువంటి ఈ స్కూలుపై తగిన చర్య తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.

వైసిపి కార్పొరేటర్‌లను లాక్కోవడం కూటమికి తగదు

స్థాయి సంఘం ఎన్నికల్లో గెలుపు మాదే
మీడియా సమావేశంలో డిప్యూటీ మేయర్లు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వైసిపి కార్పొరేటర్‌లను తమ పార్టీలోకి చేర్చుకోడానికి గాలం వేస్తున్నారని, కార్పొరేటర్ల వ్యాపారాలను ఇబ్బంది పెడతామని బెదిరించి కొంతమందిని టిడిపి, జనసేన ఎమ్మెల్యేలు కొత్త సంస్కృతికి తెర లేపారని డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టామూరి సతీష్ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం వైసిపి ఫ్లోర్ లీడర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, మేయర్ భర్త, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాస్‌లతో కలిసి వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఆరు నెలలుగా జీవీఎంసీలో పాలన ఆగిపోయిందని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి పాలన 30 రోజుల్లోనే ప్రజలకు అర్థమయిపోయిందని అనేక హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఆగస్టు 7 తేదీన జరగనున్న స్థాయి సంఘం ఎన్నికల్లో మరోసారి వైసిపి 10 అధిష్టానాలు కైవసం చేసుకుంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వెనక్కి వెళ్లిన వారంతా తిరిగి వస్తారని, రావాలని కోరారు. వెళ్లిన 12 మంది కార్పొరేటర్ లో పదిమంది కొత్త వారేనని, వారికి వైసిపి కార్పొరేటర్లుగా టికెట్లు ఇచ్చి, రాజకీయ భవిష్యత్తు కల్పించిన పార్టీకి నమ్మక ద్రోహం చేయడం సరికాదన్నారు. ఆలోచించాలని, గౌరవం మీకు కూటమి ప్రభుత్వంలో ఉండదని, అక్కడ ఉన్న టిడిపి, జనసేన పార్టీ నేతలు మిమ్మల్ని వ్యతిరేకిస్తున్నారని, మీ సొంత, వ్యాపార అవసరాల కోసం అధికారంలో ఉన్న కూటమి పార్టీలో చేరడం నైతిక విలువలు లేనివారిగా మిమ్మల్ని గెలిపించిన ప్రజలు భీ కొడతారని చెప్పారు. వైసీపీలో పదవులు అనుభవించి, గౌరవంతో మిమ్మల్ని, మీ వార్డు అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. మరో 19 నెలలు పదవే కాలం ఉన్న నేపథ్యంలో పార్టీ మారడం సరైన సంస్కృతి కాదని పార్టీ మారిన కార్పొరేటర్ ని ఉద్దేశించి వైసిపి నేతలు అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు అధిక మెజార్టీ ఇచ్చినప్పటికీ దొంగ పాలనకు జీవీఎంసీలో వైసిపి కార్పొరేటర్‌లను చేర్చుకోవడం టిడిపి, జనసేన ఎమ్మెల్యేలకు తగదని ఇలాంటి సంస్కృతిని ప్రోత్సహించవద్దని హితవు పలికారు.

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోండి

వినియోగదారులకు ఎస్ఈ మహేంద్ర నాథ్ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ప్రజలు వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎస్ఈ ఎల్.మహేంద్రనాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ళ దాబాపైన బట్టలు ఆరవేసేటప్పుడు ఇళ్ళ పైన / సమీపాన విద్యుత్ లైన్లు ఉన్నచో విద్యుత్ నిబంధనల ప్రకారం తగినంత దూరం పాటించవలెనన్నారు. కొబ్బరి, పామాయిల్ మొదలగు తోటలలో కొమ్మలు తొలగించేటప్పుడు విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 టోల్ ఫ్రీ నెంబరుకి ముందుగా తెలియజేసినచో లోకల్ విద్యుత్ సిబ్బంది ద్వారా అవసరమగు లైన్ క్లియర్ ఏర్పాటు చేసి వారి పర్యవేక్షణలో పని చేయవచ్చునని, తొందరపడి ప్రమాదాలకు గురి కావద్దు అని హితవు పలికారు. వీధి దీపాలకు సంబంధించిన ఫ్యూజ్ వైర్ల మరమ్మతులకు లైను క్లియర్ తీసుకుంటే తప్ప పాడైన స్విచ్‌లు, బల్బులు మార్చుట మొదలగు వాటిని అనుమతించిన సిబ్బంది మాత్రమే చేయాలని, మరి ఏ ఇతర వ్యక్తులు చేయరాదన్నారు. తోటలలో కానీ, పొలాలలో కానీ, ఇతర ఏ ప్రదేశములోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగి పడి ఉంటే వాటిని నేరుగా తాకరాదన్నారు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 కి తెలియజేయాలని కోరారు. విద్యుత్ ప్రవాహం జరుగుతున్నదా లేదా అని గమనించుటకు విద్యుత్ టెస్టర్ ద్వారా ప్రతీ మోటార్ ఆన్ చేయు వ్యక్తి ఆన్ చేసేముందు నిర్ధారించుకోవాలన్నారు. విధిగా బూట్లు వేసుకొని విద్యుత్ ఉపకరణములను ఆన్ చెయ్యవలెనన్నారు. గ్లాసులు ధరించడం వలన ప్రమాదం జరగకుండా ఉండుటకు దోహదపడుతుందన్నారు. ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనించిన యెడల ఆ వ్యక్తిని గానీ, విద్యుత్ పరికరాన్ని గానీ నేరుగా తాకరాదని, వెంటనే దగ్గరలోని విద్యుత్ అధికారి / సిబ్బందికి తెలియజే యాలన్నారు. వినియోగదారులు వారి ఆవరణలోని అంతర్గత వైరింగుకు ఉపయోగించే విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హెూల్డర్లు, పరికరాలను నాణ్యత కలిగిన వాటిని ఉపయోగించడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చునని, విద్యుత్ వినియోగదారులు ఇంటిలోని స్విచ్ బోర్డులను భద్రతా ప్రమాణాలు పాటిస్తూ తగినంత ఎత్తులో అమర్చుకోనవలెనన్నారు. ఇంటిలో వాడే విద్యుత్ వైర్లకు మధ్య మధ్యలో అతుకులు లేకుండా తగినంత వైరు ఉండేలా చూసుకో వాలని, ఒకవేళ అతుకు ఉన్నచో దానిని నాణ్యత కలిగిన ఇన్సులేషన్ టేప్ తో సరిగా టేపింగ్ చెయ్యవలెనన్నారు. విద్యుత్ వినియోగదారులు వాటర్ హీటర్లు, ఎలక్ట్రిక్ ఐరన్ బాక్స్, ఎలక్ట్రిక్ కుక్కర్, ఎలక్ట్రిక్ స్టవ్ తదితర విద్యుత్ ఉపకర ణాలను తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ వినియోగదారులు వారి వ్యవసాయ పొలానికి నీరు పెట్టేటప్పుడు గానీ, వారి ఇంటికి అవసరమగు నీటి కోసం గానీ వాటర్ మోటార్ స్విచ్ ఆన్ చేసేటప్పుడు కరెంటు షాక్ లు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ సర్వీసు కొరకు వినియోగించే సర్వీసు వైరు నాణ్యమైన లోడుకు అనుగుణంగా తగు కెపాసిటీ వాడినట్లయితే విద్యుత్ సరఫరాలో అంతరాయాలను, వోల్టేజ్ హెచ్చు తగ్గులను నివారించవచ్చున్నారు. ప్రతీ ఇంటి విద్యుత్ సర్వీసుకు , ఇంటిలో ఉపయోగించే పరికరాలకు తప్పనిసరిగా ఎర్త్ పైపు ద్వారా ఎర్తింగును ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టవచ్చున్నారు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు (సపోర్టు వైర్లు) ముట్టుకొనరాదన్నారు. ఇల్లు, ఇతర నిర్మాణాలు జరుగుచున్నప్పుడు దగ్గరలో విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు ఉన్నచో విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియచేసి, విద్యుత్ సంస్థ ప్రామాణిక నిబంధనల ప్రకారం తగిన దూరం పాటించి నిర్మాణాలను చేపట్టవలెనన్నారు. తడి చేతులతో, తడి కాళ్ళతో ఉన్నప్పుడు స్విచ్‌లను వేయరాదని, విద్యుత్‌కి సంబంధించిన సమస్యల పరిష్కారము కొరకు సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందిని మాత్రమే సంప్రదించవలెనని, ఇతర ప్రయివేటు వ్యక్తులను సంప్రదించరాదన్నారు. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులు, విద్యుత్ పరికరాలను రిపేర్ చేయువారు విద్యుత్ భద్రతా నియమాలను పాటించవలెనన్నారు. ఫ్లెవజనశ్రీ అమర్చేటప్పుడు దగ్గరలో ఎటువంటి విద్యుత్ వైర్లు/లైన్లు లేని ప్రదేశంలో అమర్చలని, ఫ్లెక్సీలు తీసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్ఈ ప్రజలకు తెలియజేశారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర – యస్.రాయవరం: వరి రైతులు యజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. సోమవారం వ్యవసాయ పరిశోధనా స్థానం, కొక్కిరాపల్లి సేద్య విభాగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్, ఎంబిజిఎస్. కుమారి ఆధ్వర్యంలో వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఏబీయం (ప్రజనన శాస్త్రం), వ్యవసాయ ఉపసంచాలకులు ఎలమంచిలి, ఎడిఎ ప్రభాకర్‌తో కలిసి వరి నారుమడులను సందర్శించారు. ఈ అధిక వర్షాలకు నారుమడిలో చేరిన నీటిని తీసివేయాలని, నీటిని తీసిన తరువాత యూరియా 1 కేజీ మ్యురేట్ ఆఫ్ పొటాష్ ఒక కేజీ 5 సెంట్లు నారుమడికి వేసుకోవాలని, తెగుళ్ల ఆశించకుండా కార్బన్డిజం ఒక గ్రాము లేదా మ్యాన్కో జబ్ మూడు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వరి నారు మొలక దశలో నీట మునిగి పాడైనట్లయితే వెంటనే సంబంధిత వ్యవసాయాధికారిని సంప్రదించి విత్తనాలు సేకరించుకొని నారు పోసుకోవచ్చు అన్నారు. ఈ వర్షాలకు చేరిన నీటితో దమ్ము చేపట్టి ఎకరానికి ఎరువులు సింగిల్ సూపర్ ఫాస్పేట్ 150 కేజీలు, యూరియా 30 కేజీలు, 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దమ్ములో తప్పనిసరిగా వేసుకోవాలని, వరి నారుమడిలో ఈ వాతావరణానికి పొడ తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి రైతులు వరి నారుమడి చుట్టూ ఉన్న గట్లపై ఉన్న కలుపుని కోసివేసి తెగులుని గమనించినట్లయితే నివారణకు హెక్సా కొనజోల్ రెండు మిల్లీలీటర్లు లీటర్ నీటికీ చొప్పున కలిపి వరి నారుకి పిచికారి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాయవరం వ్యవసాయ అధికారి సౌజన్య, శాస్త్రవేత్తలు అభ్యుదయ రైతులతో పాటుగా గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్నానని విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. స్థానిక 32వ వార్డు భీమనగర్ ప్రాంతం శ్రీ దుర్గా దేవి ఆలయంలో మంచి నీటి కొళాయిని డాక్టర్ కందుల నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రతి సమస్యను నిశితంగా పరిశీలించి ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేస్తున్నానని తెలిపారు. ఇక్కడ ప్రజలు నీటి సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్నారని ఆ విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లానని అధికారులు తన వినతికి స్పందించి వెంటనే మంచినీటి కొళాయిని మంజూరు చేశారని పేర్కొన్నారు. ముమ్ముందు ప్రజలు వార్డులో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఈశ్వరరావు, ఆదినారాయణ, మద్ది రాజ శేఖర్ రెడ్డి, కుమారి, పద్మ, కనకమహాలక్ష్మి, సూర్య కుమారి, దక్షిణ నియోజకవర్గ యువ నాయకులు, 32వ వార్డు ఇన్‌చార్జి కందుల బద్రీనాథ్, కందుల కేదార్నాథ్ పాల్గొన్నారు.

రక్షణరంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించండి

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: తూర్పు నౌకాదళం పరిధిలోని నేవల్ డాక్ యార్డ్‌తో పాటు మెటీరియల్ ఆర్గనైజేషన్ (విశాఖపట్నం) సంస్థలో పర్మనెంట్ రక్షణ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాటి పరిష్కారానికి సహకారం అందించాలని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ను డాక్ యార్డ్ కార్మిక నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలో ఆయన ఆఫీసులో ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సబ్బం కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఉడతా అప్పలరాజు నాయకత్వంలో ప్రతినిధుల బృందం కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేసే సమస్యలను ఆయనకు క్లుప్తంగా వివరించారు. ముఖ్యంగా ఓటిపై హెచ్ఆర్ లెక్కకట్టి ఇవ్వాలి, కోర్టుతీర్పులను అమలు చేయాలి, ఫ్యాక్టరీ ఆక్ట్ ప్రకారం ఓటి గంటల పెంచాలి, డైలీ వేజ్ కార్మికులకు రెగ్యులరైజ్ వంటి అంశాలపై ఆయనతో చర్చించారు. అనంతరం కార్మిక మంత్రికి శాలువా కప్పి, మెమొంటో అందజేశారు. వీటిపై మంత్రి అసెంబ్లీలో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రతినిధుల బృందంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎం.వై.ప్రసాద్ బాబు, వి.సాయి కుమార్, పి సునీల్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్. రమేష్, అసిస్టెంట్ సెక్రటరీ జి వెంకటేష్, వి. గణేష్, పి నాగేంద్ర పాల్గొన్నారు.

లేబర్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

వివరాలు తెలియపరచని అధికారులు
మేజర్ ఆఫీస్‌లో మీ వివరాలను కనుక్కోండి
దీనస్థితిలో కార్మికులు

విశాలాంధ్ర – ఆనందపురం: కార్మికులకు అండగా నిలవాల్సిన ఫ్యాక్టరీ యజమాన్యాలు కార్మికులను మోసం చేస్తే వారి గోడును ఎవరితో చెప్పుకుంటారు వాళ్ళ కుటుంబానికి అండదండలుగా ఉండి కష్టసుఖాల్లో ఓదార్పుగా ఉండాల్సిన ఫ్యాక్టరీ యాజమాన్యాలు మోసాలతో కార్మికుల పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉంది. వివరాల్లోకెళ్తే మండలంలో బొడ్డపాలెం ఇండస్ట్రీ లో ఎవర్గ్రీన్ విన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్లైవుడ్ కంపెనీలో సోమవారం లేబర్ ఇన్స్పెక్టర్, జిఎస్టి అధికారులు రహస్యంగా తనిఖీలు నిర్వహించడం పై కార్మికులు పలు అనుమానాలుకు దారితీస్తున్నాయి. సోమవారం నుండి కంపెనీలో లేబర్ ఇన్స్పెక్టర్ కృష్ణారావు సిబ్బంది రెండు వాహనాలపై వచ్చి సాయంత్రం 6 గంటల వరకు కంపెనీలో విచారణ చేపట్టారు. కంపెనీ యజమాని సంతోష్ తో పలు రహస్య మంత్రాల జరపడంపై కార్మికులు కార్మిక చట్టాలపై విరక్తి చెందుతున్నారు. కంపెనీలో ఎటువంటి దర్యాప్తులు చేపట్టారు వివరాలు తెలవక ఎలాంటి సమాచారం కావాలన్నా విశాఖపట్నం హెడ్ ఆఫీస్ లో కనుక్కోవాలని లేబర్ ఇన్స్పెక్టర్ కృష్ణారావు దురుసుగా సమాధానం చెప్పినట్లు స్థానికులు తెలిపారు. కార్మిక చట్టాలపై గౌరవం ఉన్న లేబర్ ఇన్స్పెక్టర్ ఈ రకంగా రహస్యాలు మంతనాలు జరపడంపై పలువురు లేబర్ వ్యవస్థపై విమర్శలు గుప్పిస్తున్నారు. యాజమాన్యానికి కార్మికులకు వారధిగా నిలవలిసిన లేబర్ కమిషనర్ ఈ రకంగా సమాధానం చెప్పడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్మిక చట్టాలు లేబర్ వ్యవస్థ పై ఎంతో గౌరవం ఉన్న ఈ రంగం యాజమాన్యానికి కార్మికులకు వారధిగా నిలవాలని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు ఎంతో కాలుష్యాన్ని వెదజల్లే ఇటువంటి కంపెనీలపై అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.